జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
మంగళవారం | 3 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 7

ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- ఏఎస్డీ, డిలీషన్ జాబితాలను పక్కాగా విచారించాలి
- నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ



జగిత్యాల, నవంబర్ 02 (ప్రజాజ్యోతి) : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో

మిగతా 2 లో...

గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి:
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



కొనరావుపేట, నవంబర్. 02(ప్రజాజ్యోతి) విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం కోనరావుపేట మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకొని, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు చేస్తున్న మెనూ చార్ట్‌ను పరిశీలించి, వంటగది, గోదాంలో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆ రోజు విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలు సిద్ధం చేశారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ అమలు, పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం

మిగతా 2 లో...

- మూడు రకాల బియ్యానికి గరిష్ఠ ధరలు ఖరారు
- నిర్ణయించిన ధరలకే విక్రయించాలి.. దుకాణాల్లో ధరల పట్టికలు ప్రదర్శించాలి
- అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు
- జిల్లా పౌరసర ఫరాల అధికారి శ్రీనాథ్



సన్నబియ్యం ధరలకు కళ్లెం!

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 2, ప్రజాజ్యోతి: సన్నబియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కెట్లో బియ్యం ధరలు పెంచి విక్రయించేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారన్న నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. వినియోగదారులపై అదనపు భారం పడకుండా మూడు రకాల సన్నబియ్యానికి గరిష్ఠ ధరలను నిర్ణయించింది. మిల్లర్లు, ట్రేడర్లు, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని స్పష్టం చేసింది. నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

కిలో సన్నబియ్యం ధర రూ. 66 నుంచి రూ. 79 వరకు..

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం సన్నబియ్యం కిలో రూ.66కు విక్రయించాలి. తెలంగాణ సోనా, ఆర్ఎన్ఆర్ రకం బియ్యం కిలో రూ.74కు, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.79కు మించకుండా అమ్మకాలు చేపట్టాలి. ఈ ధరల వివరాలను బియ్యం మిల్లులు, హోల్‌సేల్ వ్యాపార సంస్థలు, రిటైల్ దుకాణాల వద్ద వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు..

బియ్యం నిత్యావసర వస్తువు కావడంతో ధరల పెరుగుదల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై నేరుగా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయించకుండా

మిగతా 2 లో...

జగిత్యాలలో హృదయవిదారక ఘటన

- "నన్ను తీసుకెళ్లు అమ్మా.. భయమేస్తుంది!"
- మూడేళ్లుగా పెంచుకుంటున్న చిన్నారిని వేరుచేసిన అధికారులు
- తల్లిదండ్రులకు అప్పగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా మరుగున పడుతున్న వైనం
- క్షీణిస్తున్న చిన్నారి ఆరోగ్యం.. ఆందోళ



నలో పెంపుడు తల్లిదండ్రులు

జగిత్యాల, నవంబర్02(ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లాలో మానవతా దృక్పథాన్నికలచివేసే ఒక హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. మూడేళ్లుగా కంటికి రెప్పలా పెంచుకుంటున్న చిన్నారిని, చట్టపరమైన దత్తత (లీగల్ అడాప్షన్) ప్రక్రియ పూర్తికాలేదన్న కారణంతో అధికారులు శిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు. అప్పటివరకు తమతోనే ఉన్న చిన్నారిని

మిగతా 2 లో...

జిల్లా పర్యాటక, చారిత్రక ఖ్యాతిని మరింత చాటాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఉత్తమ రీల్స్, వీడియోలు రూపొందించి.. ఎక్కువ వ్యూస్ ఉన్న వారికి నగదు ఐడీ ఓసీలో బహుమతుల పంపిణీ



వేములవాడ, నవంబర్, 02: ప్రజాజ్యోతి. జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాల ఖ్యాతిని రీల్స్, వీడియోల ద్వారా మరింత చాటాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ వద్ద ఉన్న ఫారెస్ట్ అర్బన్ పార్క్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ఉన్న వీటీ ఏ డీ ఏ పార్క్, నాంపల్లి గుట్ట కు సంబంధించిన ఉత్తమ రీల్స్, వీడియోలు రూపొందించి.. అలాగే ఎక్కువ వ్యూస్ వచ్చిన వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ నగదు బహుమతులు అందజేసి.. అభినందించారు. మొదటి బహుమతి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల సిరిసిల్లకు చెందిన ఎం ప్రణవి అండ్ టీంకు రూ. 15 వేలు, రెండో బహుమతి

మిగతా 2 లో...

గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



(మొదటి పేజీ తరువాయి...)

నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. హాస్టల్ ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులను కల్పించాలని సూచించారు. విద్యార్థులు హాస్టల్‌లో అందుబాటులో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని, చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కలెక్టర్ సూచించారు. ప్రణాళికాబద్ధంగా ఉన్నత విద్యను అభ్యసిస్తూ, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. ఇందులో ఎంపీడీవో స్నిగ్ధ పాల్గొన్నారు.

జిల్లా పర్యాటక, చారిత్రక ఖ్యాతిని మరింత చాటాలి

(మొదటి పేజీ తరువాయి...)

సిరిసిల్లకు చెందిన మిట్టపెల్లి రాకేష్ కు రూ.10వేలు, మూడో బహుమతి బోయినపల్లి మండలం దుండ్రపల్లికి చెందిన కడకుంట్ల రాకేష్ కు రూ. ఐదువేల నగదు బహుమతి జిల్లా కలెక్టర్ అందజేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాల ఖ్యాతిని సోషల్ మీడియా, వివిధ వేదికల ద్వారా ఆయా ప్రాంతాల విశేషాలు అందరికీ తెలిసేలా సృజనాత్మకంగా రీల్స్ రూపొందించాలని సూచించారు. యువత, ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించే మరిన్ని వీడియోలు రూపొందించి .. విస్తృత ప్రచారం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అష్టల్ బేగం, డి.టి.సి.పి.ఓ అన్సార్ పాల్గొన్నారు.

ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

(మొదటి పేజీ తరువాయి...)

కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్), డిలీషన్ జాబితాలను క్షుణ్ణంగా విచారించాలని, ఆధారాలు లేకుండా ఏ అర్హుడి పేరునూ తొలగించవద్దని స్పష్టం చేశారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తూ, ప్రతి నిర్ణయానికి స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలన్నారు. నవంబర్ 26 నాటికి విచారణలు పూర్తి చేసి, నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసునాంబ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కుటుంబసమేతంగాభీమేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ



వేములవాడ,నవంబర్,2:ప్రజాజ్యోతి. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్‌బి. గీతే కుటుంబ సమేతంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎస్పీ దంపతులకు ఆలయ అర్చకులు, వేద పండితులు , మంత్రోచ్ఛారణలు మరియు స్వస్తి వచనాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్. రమాదేవి లడ్డూ ప్రసాదాన్ని అందజేయగా, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ శేష వస్త్రంతో ఎస్పీ ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీఐ వీరప్రసాద్, పీఆర్ఓ పెరిక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సన్నబియ్యం ధరలకు కళ్లెం!


(మొదటి పేజీ తరువాయి...)

ప్రభుత్వం గరిష్ఠ ధరలను నిర్దేశించింది. అయితే నిర్ణయించిన ధరలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? వ్యాపారులు నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై పర్యవేక్షణ కీలకంగా మారింది. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది.

ధరల పట్టికలు ప్రదర్శించాలి..

బియ్యం కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వచ్చే వినియోగదారులకు ఏ రకం బియ్యం ఎంత ధరకు లభిస్తుందో తెలిసేలా ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. నిర్ణయించిన గరిష్ఠ ధరల కంటే ఎక్కువ వసూలు చేయకుండా వ్యాపారులు నిబంధనలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల అమలులో నిర్లక్ష్యం వహించినా, వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేసినా సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

నిబంధనలు పాటించాలి: జిల్లా పౌరసరఫరాల



అధికారి శ్రీనాథ్

ఈ విషయమై పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ ధరల ప్రకారమే మిల్లర్లు, ట్రేడర్లు, వ్యాపారులు సన్న బియ్యం విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. అన్ని



దుకాణాల్లో ధరల పట్టికలను ఏర్పాటు చేసి వినియోగదారులకు ధరల వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిర్ణయించిన ధరల కంటే అధికంగా బియ్యం విక్రయిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ధరల నియంత్రణ చర్యలకు వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

జగిత్యాలలో హృదయవిదారక ఘటన

(మొదటి పేజీ తరువాయి...)



దూరంచేయడంతో ఆ పసికందు పడుతున్న వేదన, తల్లిదండ్రుల ఆవేదన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది.

అసలు ఏం జరిగిందంటే..?

జగిత్యాలలో హిందూ సంప్రదాయ పద్ధతి ప్రకారం ఓ చిన్నారిని దత్తత తీసుకొని దంపతులు మూడేళ్లుగా అపురూపంగా పెంచుకుంటున్నారు. అయితే, చట్టపరంగా చిన్నారిని దత్తత తీసుకోలేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో రంగంలోకి దిగిన శిశు సంక్షేమ శాఖ అధికారులు, పెంపుడు తల్లిదండ్రుల నుంచి చిన్నారిని వేరుచేసి స్థానిక శిశు సంక్షేమ కేంద్రానికి తరలించారు. ఈ క్రమంలో శిశు సంక్షేమ కేంద్రంలో ఉన్న తమ చిన్నారిని చూసేందుకు వెళ్లిన తల్లిదండ్రులను చూసి ఆ పసిగుడ్డు విలవిలలాడిపోయింది. "నన్ను తీసుకెళ్లు అమ్మా.. భయమేస్తుంది" అంటూ చిన్నారి గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడ ఉన్నవారందరినీ కంటతడి పెట్టించింది.

హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా అధికారుల తాత్సారం

ఈ వ్యవహారంపై పెంపుడు తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. హిందూ సంప్రదాయ ప్రకారమే తాము చిన్నారిని దత్తత తీసుకున్నామని, చిన్నారిని తిరిగి తమకు అప్పగించేలా ఆదేశించాలని కోరగా.. విచారించిన న్యాయస్థానం అక్టోబర్ 16వ తేదీనే చిన్నారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ అధికారులు వివిధ కారణాలు చూపుతూ జాప్యం చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు వల్ల చిన్నారి తల్లికి దూరమై మానసికంగా కుంగిపోవడమే కాకుండా, అనారోగ్యం పాలవుతోందని వారు వాపోతున్నారు. న్యాయస్థానం తీర్పునిచ్చినా తమకు న్యాయం జరగకపోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం చిన్నారిని వెంటనే తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

హైకోర్టు ఉత్తర్వుల మేరకు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తాం
కలెక్టర్ సత్యప్రసాద్

సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న దత్తత బాలుడి వ్యవహారంపై జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ స్పందించారు. గౌరవ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల (ఇంటరిమ్ రిలీఫ్) ప్రకారం బాలుడిని పెంచుకుంటున్న తల్లిదండ్రులకు ఈరోజు రాత్రి లేదా రేపు ఉదయం అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. సంతానం లేకపోవడంతో హిందూ సంప్రదాయం ప్రకారం బాలుడిని దత్తత తీసుకుని మూడేళ్లుగా పెంచుకుంటున్నామని, అయితే ప్రచారం అయిన వార్తల ఆధారంగా అధికారులు శిశు సంక్షేమ కేంద్రానికి తరలించారని సదరు మహిళ తెలిపారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించగా బాలుడిని అప్పగించాలని కోర్టు ఆదేశించింది. సీడబ్ల్యూసీ అనుమతులు, పరిపాలనాపరమైన ప్రక్రియల వల్లే అప్పగింతలో కొంత జాప్యం జరిగిందని కలెక్టర్ వివరించారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

- **చిగురుమామిడి లో బిఆర్ఎస్ మహాధర్నా**
- **కరువు మండలం గా ప్రకటించకపోతే వెంటనే మంత్రి రాజీనామా చేయాలి..**
- **బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి**

చిగురుమామిడి /నవంబర్ 02,ప్రజా జ్యోతి ప్రస్తుతం మండలంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి ఇచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం వల్ల తెచ్చిన కరువు అని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకట రమణారెడ్డి అన్నారు.చిగురుమామిడి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం మహాధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న చిగురుమామిడి మండలంలో ఇంతటి తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నా,ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.దశాబ్దాలుగా మెట్ట ప్రాంతంగా ఉన్న ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు న్యాయం చేయలేని పక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. చిగురుమామిడి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని,మండలానికి కరువు సహాయం కింద పెద్ద ఎత్తున ప్రత్యేక నిధులు మంజూరు చేసి, వెంటనే విడుదల చేయాలన్నారు.420అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే వెంటనే దిగిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి,సర్పంచ్ బోయిని రమేష్,మాజీమండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి,మాజీసర్పంచ్ లు సన్నీల్ల వెంకటేష్,బెజ్జంకి లక్ష్మణ్,మాజీ ఎంపీటీసీ సభ్యులు మిట్టపల్లి మల్లేశం,కత్తుల రమేష్‌యాదవ్, పెసరి రాజేశం,హనుమండ్ల సత్యనారాయణ,బుర్ర తిరుపతి గౌడ్,ఎస్ కే సిరాజ్,ఉపసర్పంచ్ లు మేడబోయిన రాజు,కాసర్ల హరీష్,కాశబోయిన రాజు యాదవ్,శ్యామ కూర సంపత్ రెడ్డి,నాగేల్లి రాజిరెడ్డి,చెప్యాల నారాయణరెడ్డి,తాటికొండ సందీప్ రెడ్డి,కత్తుల ప్రశాంత్,అంజిరెడ్డి,సిద్దెంకి రాయమల్లు,తోట శ్రీనివాస్,చెరుకు సంజీవ్,కిష్టారెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలలకు అడుగు..

- ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు
- బుగ్గారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణాలకు శ్రీకారం లబ్ధిదారుల్లో ఆనందం





బుగ్గారం, నవంబర్ 2 (ప్రజాజ్యోతి): ప్రతి పేదకుటుంబానికి సొంతింటికలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల్లో కొత్త ఆశలు నింపుతోంది. ఈ పథకంలో భాగంగా బుగ్గారం మండలంలోని బుగ్గారం, గోపులాపూర్, సిరికొండ, వెలుగొండ గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల కోసం అధికారులు ముగ్గులు పోయించారు.

›› ఏళ్ల నిరీక్షణకు ఫలితం..

సొంత ఇల్లు లేక ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో, చిన్న చిన్న గుడిసెల్లో జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఊరట నిస్తోంది. తమకంటూ ఒక సొంత గూడు ఉండాలన్న చిరకాల కోరిక నెరవేరబోతోందనే ఆశతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి స్థలంలో ముగ్గులు పడటంతో తమ సొంతింటి కలకు తొలి అడుగు పడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.పలు గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేసే ఈ పథకం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

›› పేదల జీవితాల్లో కొత్త వెలుగులు..

ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదు..ఒక కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒక గొప్ప అవకాశంగా నిలుస్తోంది. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కలగాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలి

- కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు



కొడిమ్యాల,నవంబర్ 03,(ప్రజాజ్యోతి): మండల పరిసర ప్రాంతాల నుంచి కొడిమ్యాల కేంద్రానికి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టి, అధిక ధరల విక్రయాలకు కళ్లెం వేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన మోద్నాల సాగర్ సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- ఎండపల్లిలో ఐదు అర్జీల స్వీకరణ



ఎండపల్లి, నవంబర్ 2 ప్రజా జ్యోతి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో డి. కృపాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ సమస్యలతో ప్రజలు అర్జీలు సమర్పించారు. మొత్తం ఐదు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.వీటిలో మండల ప్రజా పరిషత్‌కు సంబంధించి ఒకటి, తహశీల్దార్ కార్యాలయానికి సంబంధించి ఒకటి, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మూడు దరఖాస్తులు ఉన్నాయి.ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

మేడిపల్లి బస్టాండ్‌లో మహిళల అవస్థలు.. కనీస సౌకర్యాలు కరువు

- శౌచాలయం, తాగునీటి వసతి కల్పించాలని ప్రజావాణిలో వినతి



మేడిపల్లి, నవంబర్ 2 (ప్రజాజ్యోతి) మండల కేంద్రంలోని మేడిపల్లి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పసిపిల్లల తల్లులు నిత్యం అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లో కనీసం శౌచాలయం కూడా లేకపోవడంతో బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్‌లో తక్షణమే మహిళలకు ప్రత్యేక శౌచాలయం, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సంబంధిత ఆర్టీసీ అధికారులు, మండల అభివృద్ధి అధికారికి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఇలాంటి కనీస సౌకర్యాలు లేకపోవడం విచారకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి మహిళలకు, ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని మెట్టు ప్రకాష్ రిటైర్ ఆర్మీ,మల్లారెడ్డి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- అధిక సామర్థ్య ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి

కొడిమ్యాల,నవంబర్ 03,(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలో తక్కువ వోల్టేజీ, విద్యుత్ అంతరాయాల సమస్యల పరిష్కారానికి అధిక సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుర్రం నర్సయ్య, ఏడీ మహేందర్, ఏఈ భాస్కర్,ఎస్ఎల్ఐ రమేష్ బాబు, లైన్ ఇన్స్పెక్టర్ కొమురయ్య, లైన్మెన్ శంకర్,జేఎల్ఎం మనోజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ



వెల్గటూర్, నవంబర్ 2 ప్రజా జ్యోతి వెల్గటూర్ మండలంలోని సంకెనపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొదురుపాక పూజ సతీష్, ఉప సర్పంచ్ తోకల నారాయణ, పీఆర్ఏఈ రాజు పాల్గొని భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో మహిళా సంఘాల బలోపేతానికి, మహిళలకు అవసరమైన సమావేశాలు నిర్వహించుకునేందుకు మహిళా సమాఖ్య భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మహిళా సంఘం అధ్యక్షురాలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల,నవంబర్02 (ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నవంబర్ 1 నుండి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు.ఈ నిబంధనల ప్రకారం... పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు మరియు సమావేశాలు నిర్వహించడానికి వీలు లేదు. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూర్చేలా ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎస్పీ హెచ్చరించారు.జిల్లా ప్రజలు, అన్ని వర్గాల ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల మహా ధర్నా - కలెక్టరేట్ ముట్టడి

- ఎన్నికల హామీ మేరకు రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్



జగిత్యాల,నవంబర్2(ప్రజాజ్యోతి): అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ & హెల్పర్స్ యూనియన్ (AITUC) ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించి, ముట్టడి చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏశ మేని గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగరి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రకారం అంగన్వాడీలకు నెలకు రూ.18,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పీఎఫ్, హెల్త్ కార్డులు, రూ.25 లక్షల బీమాతో పాటు నెలకు రూ. 10,000 పెన్షన్ కల్పించాలన్నారు. బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు, టీఏ, డీఏ బకాయిలు చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయడంతో పాటు సీనియారిటీ ప్రకారం గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు దయావతి, లక్ష్మీ, లావణ్య, శారద, ఏఐటీయూసీ నాయకులు సుతారి రాములు, అందే వంశీ, ఎం.డి. ఉస్మాన్, రామిల్ల రాంబాబు పాల్గొన్నారు.



హరిదాస్ నగర్ లో సీసీ కెమెరాలు ప్రారంభము

- సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి



ఎల్లారెడ్డిపేట నవంబర్ 2(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాను నగర్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం రోజు సీసీ కెమెరాలను గ్రామపంచాయతీ ఏర్పాటు చేసింది వాటిని సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవానందం ,ఎస్సై రమేష్, సర్పంచ్ నాగరాజ్, ఏఎంసి వైస్ చైర్మన్ నంది కిషన్,, సద్ది లక్ష్మారెడ్డి, గౌస్ బాయ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఎక్కడ

- నిజమైన నిరుపేదలకు న్యాయం చేయాలి
- జీవో నెంబర్ 33 నిబంధనలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి
- సర్పంచ్ ఎలుక అంజనేయులు





తిమ్మాపూర్ నవంబర్ 2(ప్రజాజ్యోతి) :-ప్రజావాణిలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికపై జిల్లా కలెక్టర్ కు వినతి సమర్పించిన తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ సర్పంచ్ ఎలుక ఆంజనేయులుగ్రామస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో జరుగుతున్న పరిణామాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 33 ప్రకారం సర్పంచ్ చైర్మన్ గా,కమిటీ సభ్యుల ప్రత్యక్ష భాగస్వామ్యంతో,అర్హతలను పరిశీలించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది.కానీ వాస్తవంగా గ్రామ సర్పంచ్ కు కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.L1 జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు మాత్రం ఇప్పటికీ ఇళ్లు అందని పరిస్థితి నెలకొంది.నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి సిఫారసు చేసిన లబ్ధిదారుల పేర్లు జిల్లా కలెక్టర్,ఎంపీడీవో గెజిటెడ్ అధికారి లాగిన్‌లకు వస్తున్నాయని,ఆ జాబితాలో పేర్లు ఉన్నవారికి వ్యవసాయ భూములు సొంత ఇల్లు వాహనాలు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నారు.దీనివల్ల అర్హులకు అన్యాయం జరుగుతుంది.మధ్యవర్తుల జోక్యం, డబ్బుల వ్యవహారాలపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపిక జాబితా గ్రామ సభలో బహిరంగంగా జరగాలని లబ్ధిదారుల సమగ్ర విచారణ చేసి,ఇందిరమ్మ ఇండ్ల రెండో దశ జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిజమైన నిరుపేదలకు ఇండ్ల ఇవ్వాల్సిందిగా కోరటం జరిగింది.

అంకుషాపూర్ అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం



తంగళ్ళపల్లి నవంబర్ 2 (ప్రజాజ్యోతి):తంగళ్ళపల్లి మండలం అంకుషాపూర్ గ్రామంలో అకాల వర్షానికి తడిసి ముద్దైనా వరి ధాన్యం. ఆరు కాలం రైతు కష్టపడి పండించినపంట వర్షంలో తడవడంతో కన్నీరు మున్నిరైన రైతులు.నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరిన రైతులు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రం త్వరగా ప్రారంభించకపోవడం వలన ఇలా నష్టం జరిగిందని సోషల్ మీడియా వేదికగా తెలిపిన బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు గజభింకర్ రాజ న్న. రైతులను ఆదుకోవాలని ప్రభుత్వన్నీ ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

రైతు లేనిదే రాజ్యం లేదు.. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఏఎంసీ చైర్మన్ ఆరుట్ల మహేష్ రెడ్డి
- ఆవునూరు, చికోడు, మద్దికుంట, మోహినికుంట గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ముస్తాబాద్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని ఆవునూరు, చికోడు, మద్దికుంట,మోహినికుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ ఆరుట్ల మహేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఏఎంసీ డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ఆరుట్ల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు లేనిదే రాజ్యం లేదని, రైతు సంక్షేమమే సమాజ అభివృద్ధికి పునాది అని అన్నారు. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని దళారులు చేతుల్లో విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తమ ధాన్యాన్ని విక్రయించి ఆర్థికంగా లబ్ధి పొందాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసి, రైతులకు తాగునీరు,ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆరుట్ల మహేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సడిమెల,బాలయ్య ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఏఎంసీ డైరెక్టర్లు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐకేపీ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ వేడుకలకు సిరిసిల్ల వేదిక

- కళాకారుల ఐక్యత, సంక్షేమమే ప్రధాన లక్ష్యం



సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 2 (ప్రజా జ్యోతి) తెలుగు ఫోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలను సిరిసిల్ల పట్టణ కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫోక్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి మమ్మద్ సత్తర్, అధ్యక్షులు పత్తిపాటి రమణకర్ లు తెలిపారు.సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఇంత పెద్ద ఎత్తున వివిధ రంగాలకు చెందిన కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నిర్వహిస్తున్న కార్యక్రమం తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలని పేర్కొన్నారు.ఈ వేడుకలకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి కవులు,కళాకారులు, టెక్నీషియన్లు,కెమెరామెన్లు,సినీ రంగంలోని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం సిరిసిల్ల పాత బస్టాండ్ నుంచి కళాకారుల భారీ ర్యాలీ ప్రారంభమై సభా వేదిక వరకు కొనసాగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ముందుగా నమోదు చేసుకున్న కళాకారులకు వరుస క్రమంలో పాటలు అవకాశం ఇవ్వబడును ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు,ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు.తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రధాన ఉద్దేశం కళాకారుల ఐక్యత, సంక్షేమం, హక్కుల సాధనేనని స్పష్టం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కళాకారులకు కూడా అందించాలని డిమాండ్ చేశారు. కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఫోక్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే సీనియర్ కళాకారులకు నెలవారీ పెన్షన్, ఆరోగ్య బీమా సదుపాయం, నిరుపేద కళాకారులకు పక్కా ఇళ్లు, వడ్డీ లేని రుణాలు,సీనియర్ కళాకారుల పిల్లలకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అనేక సంవత్సరాలుగా తెలంగాణ కళాకారులు సమాజశ్రేయస్సు కోసం తమ కళారూపాల ద్వారా విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. వార్డు మెంబర్ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు ప్రజల్లో చైతన్యం కలిగించే పాటలు పాడి, ప్రభుత్వాల విజయాల్లో కళాకారులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కళాకారుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రతపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.తెలుగు ఫోక్ అసోసియేషన్, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆవిర్భావ వేడుకలను కార్యవర్గ సభ్యుల ముందస్తు ఆమోదం, తీర్మానం మేరకే నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. అన్ని జిల్లాల నుంచి కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గౌరవ సలహాదారు దరువు అంజన్న, కోశాధికారి గజ్వేల్ వేణు, రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సభ్యులు జడల రమేష్, రాష్ట్ర కార్యవర్గ ప్రచార కార్యదర్శి ఆకునూరి దేవయ్య, కాపర్తి మల్లికార్జున్, మంకాల ప్రసాద్, పాత శ్రీధర్, చికోడు నరసింహులు, ఫోక్ ఇండస్ట్రీ సభ్యులు ఎడమల శ్రీధర్ రెడ్డి, నవీన్, చిత్తారమ్మ మల్లేశం, శ్రీధర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

10 వేల ఏళ్ల చరిత్రకు సజీవ సాక్ష్యం.. సీతమ్మలోద్ది!

- వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి
- 560 మందికి పైగా ట్రెక్కర్లు, చిన్నారులతో హెరిటేజ్ ట్రెక్కింగ్
- పురావస్తు మ్యూజియంలో ప్రాచీన గ్రైండింగ్ పరికరం భద్రపరిచిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 2, ప్రజా జ్యోతి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సీతమ్మలోద్ది చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలని, ప్రాచీన మానవుల జీవన విధానానికి అనవాళ్లుగా నిలిచిన చారిత్రక విశేషాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.సీతమ్మలోద్ది చారిత్రక ప్రాంతంలో నిర్వహించిన హెరిటేజ్ ట్రెక్కింగ్‌లో 560 మందికి పైగా ట్రెక్కర్లు, చిన్నారులు పాల్గొనడం విశేషం. వేల సంవత్సరాల నాటి మానవ జీవనానికి ఆధారాలను అందిస్తున్న ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతోపాటు, వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పించే దిశగా ఈ కార్యక్రమం ముందడుగుగా నిలిచింది.సీతమ్మలోద్ది గుహాలో లభించిన సుమారు 10,000 సంవత్సరాల నాటి ప్రాచీన గ్రైండింగ్ పరికరం (శాడిల్ క్వెర్న్)ను జిల్లా కలెక్టరేట్‌లోని పురావస్తు మ్యూజియంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష భద్రపరిచారు. ఈ సందర్భంగా డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి ఆ పరికరం ప్రత్యేకతలు, ప్రాచీన మానవులు దానిని వినియోగించిన విధానం గురించి వివరించారు.శాడిల్ క్వెర్న్ అనేది ప్రాచీన మానవులు ధాన్యాలు, మొక్కల భాగాలు, వేర్లు, ఖనిజ వర్ణద్రవ్యాలను నూరి పొడిగా చేసేందుకు ఉపయోగించిన పరికరం. ఒక పెద్ద రాయిపై మరో చిన్న రాయిని ముందుకు,వెనుకకు రుద్దుతూ అవసరమైన పదార్థాలను మెత్తగా చేసుకునేవారు. సీతమ్మలోద్ది గుహలో ఇలాంటి పరికరాలు లభించడం అప్పటి మానవుల ఆహారపు అలవాట్లు, జీవన విధానం, కళా సంప్రదాయాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యయనం చేసేందుకు విలువైన ఆధారంగా నిలుస్తోంది.

›» చరిత్రను పుస్తక రూపంలో భద్రపరిచే ప్రయత్నం

సీతమ్మలోద్ది చారిత్రక విశేషాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో రూపొందించిన హెరిటేజ్ టేబుల్ బుక్ ప్రచురణకు కృషి చేసిన బృందాన్ని కలెక్టర్ అభినందించారు. చారిత్రక ప్రదేశాల విశిష్టతను, ప్రాచీన మానవుల జీవనానికి సంబంధించిన ఆధారాలను పుస్తక రూపంలో భద్రపరచడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.హెరిటేజ్ ట్రెక్కింగ్ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి, హెరిటేజ్ టేబుల్ బుక్ రూపకల్పనలో కృషి చేసిన అనిల్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.చారిత్రక వారసత్వ సంపదను కాపాడటంతోపాటు పర్యాటక అభివృద్ధికి ప్రోత్సాహం అందించడం, యువతతోపాటు చిన్నారుల్లోనూ చరిత్ర పట్ల ఆసక్తి, అవగాహన పెంపొందించడం హెరిటేజ్ ట్రెక్కింగ్ ప్రధాన ఉద్దేశమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.సీతమ్మలోద్ది వంటి చారిత్రక ప్రాంతాలను పరిరక్షించి, వాటి విశిష్టతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా జిల్లాలో వారసత్వ పర్యాటకానికి మరింత ప్రాధాన్యత లభించే అవకాశం ఉంది.

చిన్నారుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం


- శిశుగృహలో మెరుగైన వసతులు, నాణ్యమైన పోషకాహారం అందించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సుల్తానాబాద్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి) సంరక్షణ, రక్షణ అవసరమైన చిన్నారుల భద్రత, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రుల సంరక్షణకు నోచుకోని చిన్నారులకు ఆప్యాయతతో కూడిన సంరక్షణ అందించడంతో పాటు నాణ్యమైన పోషకాహారం, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు.సోమవారం సుల్తానాబాద్‌లోని బాలసదన్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిశుగృహాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు. అనంతరం కేంద్రంలోని గదులు, చిన్నారులకు కల్పించిన వసతులను పరిశీలించారు. పిల్లల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జననం నుంచి ఆరు సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అనాథలు, వదిలివేయబడిన, సంరక్షణ అవసరమైన చిన్నారులకు సురక్షితమైన ఆశ్రయం కల్పించడమే శిశుగృహ ప్రధాన ఉద్దేశమన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం, అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణతోపాటు వయస్సుకు తగిన అభివృద్ధి అవకాశాలు కల్పించాలని సూచించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం ఏర్పాటు చేయాలని, వారి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.శిశుగృహలో సంరక్షణ పొందుతున్న అర్హులైన చిన్నారులకు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా కుటుంబ వాతావరణం కల్పించేందుకు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ టి. రమేష్, సీడీపీఓ అనిత, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి జితేందర్, బాలసదన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈత చెట్లపై కల్లు తాగుతున్న కోతులు

► గౌడన్నలకు ఆర్థిక నష్టం!



కోనరావుపేట, నవంబర్ 2 (ప్రజాజ్యోతి)కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ఈత చెట్లపై కోతులు కల్లు తాగుతూ గౌడన్నలకు నష్టం కలిగిస్తున్నాయి. ఈత చెట్లపైకి ఎక్కి కల్లును తాగుతున్న కోతుల వల్ల కల్లు గీత కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని ఈత చెట్లపై కోతులు గుంపులుగా చేరి కల్లు తాగుతున్న దృశ్యాలు స్థానికంగా కనిపిస్తున్నాయి. కల్లు సేకరించేందుకు గౌడన్నలు ఈత చెట్లను ఎక్కి ఎంతో శ్రమిస్తుండగా, కోతులు చెట్లపైకి చేరి కల్లును తాగేయడంతో వారి కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కల్లు గీత కార్మికులకు కోతుల సంచారం మరో సమస్యగా మారిందని పేర్కొంటున్నారు.ఈత చెట్లపై కోతులు కల్లు తాగడంతో కల్లు సేకరణ తగ్గిపోవడమే కాకుండా, గౌడన్నలకు ఆదాయ నష్టం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలకు కోతుల బెడద ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు.కోతుల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గౌడన్నలు కోరుతున్నారు. తమ జీవనోపాధికి ఆటంకం కలగకుండా సమస్యను పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.మరిమడ్ల గ్రామంలో ఈత చెట్లపై కోతులు కల్లు తాగుతున్న దృశ్యాలు ఒకవైపు ఆసక్తిని కలిగిస్తున్నప్పటికీ, మరోవైపు కల్లు గీత కార్మికులకు ఆర్థిక నష్టాన్ని కలిగిస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి.

తక్కువ నీటి వినియోగం ఉన్న పంటలు సాగు చేయాలి

► మండల వ్యవసాయ అధికారి ఎం. ఉమాపతి.



ఎలిగేడు నవంబర్ 02(ప్రజా జ్యోతి) మండలంలోని నర్సాపూర్, ధూళికట్ట, నారాయణపల్లి గ్రామాల్లో రైతులకు పంట మార్పిడి, ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గడం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో మొక్కజొన్న, శనగ, నువ్వులు, పెసర్లు వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎం. ఉమాపతి రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకటేష్ గౌడ్, రంగు లత, శ్రీనివాస్ ఏఈవోలు గణేష్, సురేష్, నరేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు ఫుల్... దరఖాస్తులు నిల్



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి)కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని. మండల పరిషత్ కార్యాలయంలో. ఎంపీడీవో సురేందర్ కుమార్ అధ్వర్యంలో సోమవారం రోజున. ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి .వివిధ శాఖల అధికారులతో సమావేశం యొక్క హాల్లో అధికారులు నిందుగా ఉండగా. సమస్యల పరిష్కారానికి ప్రజలు రాక. కార్యాలయం అంత వెలవెలపోయింది .ఈ కార్యక్రమంలో. తహసిల్దార్ డాక్టర్ రాపల్లి రాముడు తో పాటు .వివిధ శాఖల అధికారులు .కార్యాలయం సిబ్బంది .తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల మధ్య ప్రభుత్వ విప్ డా. వెంకట్ బాల్మూర్ జన్మదిన వేడుకలు

♦ సత్యసాయి పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్ల పంపిణీ



జమ్మికుంట నవంబర్ 2(ప్రజా జ్యోతి):ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా. వెంకట్ బాల్మూర్ జన్మదిన వేడుకలను బాబాజీ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకొని స్థానికంగా ఉన్నసత్యసాయి మానసిక వికలాంగుల పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు పండ్ల పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారితో ఆప్యాయంగా గడిపారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులతో సమయం గడపడం, వారికి పండ్లు పంపిణీ చేయడం, వారితో కలిసి భోజనం చేయడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, జన్మదినాలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం మంచి సంప్రదాయమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి అవసరమైన వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు సుంకరి శ్యామ్, మాచర్ల వినయ్ మాచనపల్లి సర్పంచ్ విజయ్, రంజిత్ రెడ్డి, సంపత్ రెడ్డి, విశ్వంత్ రాజు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం

■ నవంబర్ 4న ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం పాట

వేములవాడ,నవంబర్,2:ప్రజాజ్యోతి వేములవాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు.కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో ఈ నెల 4వ తేదీ బుధవారం వేములవాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.వేలంలో పాల్గొనడానికి ఆసక్తి గల వారు అదే రోజు ఉదయం 9 గంటలకు తమ ఆధార్ కార్డుతో ఎక్సైజ్ స్టేషన్‌కు చేరుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కోరారు.

తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

■ సిపిఐ పార్టీ డిమాండ్



తిమ్మాపూర్ నవంబర్ 2(ప్రజాజ్యోతి)కరీంనగర్ జిల్లాతిమ్మాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించినటువంటి ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో డి శ్రీనివాస్ కు సిపిఐ తిమ్మాపూర్ మండల సమితి పక్షాన పొనగంటి కేదారి బోయిని తిరుపతి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.అనంతరం కేదారి తిరుపతి మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావంతో రానున్న రోజుల్లో తీవ్ర సంక్షోభాన్ని రైతాంగం ఎదుర్కోవలసి వస్తది నీళ్లు లేక యాసాంగి పంటలు వేయొద్దని ప్రభుత్వం ప్రకటించింది.అలాగే రైతు పరిస్థితి కూడా అర్థం చేసుకొని వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరుతున్నాము తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి అలాగే రైతులను కరువు పెన్షన్ల కింద ఆదుకోవాలిబ్యాంకు రుణాలు అదనంగా పెంచి రైతులను ఆదుకోవాలి వీటన్నిటి పైన ప్రభుత్వం చొరవచూపి రైతాంగాన్ని ఆదుకోవాలి లేనియెడల భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతుల పక్షాన ఉద్యమాలు పోరాటాలు తప్పవని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.ఈ కార్యక్రమంలోరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొన్నగంటి కేదారి,తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆవునూరి రమేష్,సిపి ఐ నాయకులు గంగిపల్లి శంకర్, పార్నంది రాజకుమారు పాల్గొనడం జరిగింది.

హైవేపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు అదనపు కమిషనర్‌కు వినతిపత్రం



కరీంనగర్ రూరల్,నవంబర్ 2(ప్రజాజ్యోతి) నగరంలోని 4వ డివిజన్ పరిధిలో ఉన్న హైవే రహదారిపై 5వ డివిజన్ గుంటూరుపల్లి వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను 4వ డివిజన్ హైవే చివరి వరకు విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ 4వ డివిజన్ అధ్యక్షులు గాదె శివరాం ప్రజావాణిలో అదనపు కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు,4వ డివిజన్ పరిధిలోని హైవే రహదారిపై సరైన వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు.తగినంత వెలుతురు లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు వెంటనే స్పందించి హైవే ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని,అవసరమైన నిధులు కేటాయించి సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రాత్రి వేళల్లో ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వారిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పిఏసీఎస్ చైర్మన్



ఇల్లంతకుంటనవంబర్ 2(ప్రజా జ్యోతి)రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రేపాక,సోమరంపేట,జంగంరెడ్డిపల్లి,ముస్కాన్ పేట, గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం రోజు ప్రారంభించిన ఇల్లంతకుంట పిఎసిఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఈ సందర్భంగా వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు . రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు .రైతు కష్టానికితగిన గౌరవం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ యాస తిరుపతి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కానేట్ సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి , ఇల్లంతకుంట సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మామిడి రాజు,జంగం రెడ్డిపల్లి సర్పంచ్ పండుగసునీత ,సోమవారం పేట సర్పంచ్ కేతిరెడ్డి భారతవ్వ–లక్ష్మా రెడ్డి ,రేపాక సర్పంచ్ కాత మల్లేశం మరియు సంఘ డైరెక్టర్లు సింగీరెడ్డి లక్ష్మి, ఏలేటి మాధవరెడ్డి, ఎలుక అనిల్ కుమార్, ఒగ్గు రమేష్ ,సొల్లు కవిత, ముకిస ఎల్లారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.20 వేల విరాళం



సుల్తానాబాద్ నవంబర్ 2(ప్రజాజ్యోతి)గట్టెపల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి సుల్తానాబాద్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన అల్లం భాగ్యలక్ష్మి–సత్యనారాయణ దంపతులు రూ.20వేల విరాళం అందజేశారు. ఆలయ పునర్నిర్మాణం ప్రాధాన్యతను వివరించగా, వారు వెంటనే స్పందించి తమవంతు సహకారం అందించారు. ఈ విరాళం అందించడంలో యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తుమ్మరాజ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. కొల్లూరి సంతోష్‌కుమార్, కరెంగుల హరీష్, కరెంగుల అజయ్, కోడి సాయి కుమార్ పాల్గొన్నారు. దైవ కార్యానికి దాతృత్వంతో ముందుకొచ్చిన దంపతులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్సైజ్ సీఐ విజేందర్‌కు మెమెంటో అందజేత

► గౌడ సంఘం సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తాం



కోనరావుపేట, నవంబర్. 02(ప్రజాజ్యోతి)కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు సోమవారం రోజున ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ విజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ విజేందర్ మాట్లాడుతూ గౌడ సంఘం సభ్యులకు ఎలాంటి అవసరం వచ్చినా తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గౌడ సంఘం సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.పల్లిమక్త గౌడ సంఘం అధ్యక్షుడు సీఐ విజేందర్‌ను సత్కరించి మెమెంటో అందజేయడం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై, గౌడ సంఘం ఉపాధ్యక్షులు,సభ్యులు, పాల్గొన్నారు.

పిట్టలపల్లి చౌరస్తాలో ఇద్దరు బలి అయినా అధికారుల్లో చలనం లేదు

- ప్రజావాణికి చేరిన స్పీడ్ బ్రేకర్ల గోడు!
- గంగాధర - కొదురుపాక డబుల్ రోడ్డుపై నిత్యం నెత్తురోడుతున్న రహదారి.. నెలకు 5 నుండి 6 ప్రమాదాలు!
- గతంలో ఆర్ అండ్ బీ (ఈఈ)కు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోని వైనం
- మరో ప్రాణం పోకముందే స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గ్రామ యువకుడు



గంగాధర 02/నవంబర్/2026 (ప్రజా జ్యోతి): గంగాధర మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు నుండి బోయినపల్లి మండలంలోని కొదురుపాక గ్రామం వరకు ఉన్న ప్రధాన డబుల్ రోడ్డుపై జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, ముఖ్యంగా పిట్టలపల్లి గ్రామ నాలుగు కూడల్ల వద్ద తక్షణమే స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని కోరుతూ గంగాధర ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' వేదిక ద్వారా వెంకంపల్లి (పిట్టలపల్లి) గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఆకుల మనోహర్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆకుల మనోహర్ మాట్లాడుతూ.. పిట్టలపల్లి గ్రామ చౌరస్తా వద్ద గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కూడలి వద్ద వాహనాల అతివేగం కారణంగా ప్రతి నెలా సుమారు ఐదు నుండి ఆరు యాక్సిడెంట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాల నియంత్రణకై గతంలోనే రోడ్లు, భవనాల శాఖ (ఆర్ & బి) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ ఈ)కు స్వయంగా కలిసి, స్పీడ్ బ్రేకర్లు వేయించాలని పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరమన్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ మధ్య కాలంలోనే అనేక మంది తీవ్ర గాయాలపాలై ఆసుపత్రి పాలయ్యారని, కాగా ఇటీవల జరిగిన ఓ భయంకర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని ఆయన గుర్తు చేశారు. ఇకనైనా అధికారులు నిద్ర మత్తు వీడి, తదుపరి ప్రాణ నష్టం జరగక ముందే పిట్టలపల్లి చౌరస్తా వద్ద యుద్ధప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్లను, ప్రమాదాల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రేపు ఇంటర్వ్యూలు

- వేములవాడ ప్రాజెక్టు పరిధిలో 9 కేంద్రాలకు 143 మంది అభ్యర్థులు అర్హత
- ఒరిజినల్ సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులతో ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌కు రావాలి
- దళారులను నమ్మవద్దు.. మెరిట్ ఆధారంగానే ఎంపికలు: కలెక్టర్ గరిమ అగ్రవాల్

వేములవాడ,నవంబర్,2:ప్రజాజ్యోతి.వేములవాడ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఈ నెల 3వ తేదీ మంగళవారం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీ రాజం వెల్లడించారు.వేములవాడ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 12 అంగన్ వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి 350 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు, స్థానికత, రిజర్వేషన్ తదితర నిబంధనలను పరిగణనలోకి తీసుకొని పరిశీలన చేపట్టగా, 9 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి 143 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. అర్హుల జాబితాను సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు.మిగిలిన మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి నిబంధనల ప్రకారం అర్హత సాధించిన అభ్యర్థులు ఎవరూ లేరని స్పష్టం చేశారు.

అభ్యర్థులు తప్పనిసరిగా హాజరుకావాలి

ఈ నెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 143 మంది అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలు, గుర్తింపు కార్డులతో నిర్దేశిత సమయానికి హాజరుకావాలని జిల్లా సంక్షేమ అధికారి సూచించారు.

దళారులను నమ్మవద్దు.. మెరిట్‌కే ప్రాధాన్యం

అంగన్‌వాడీ టీచర్ పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఐఏఎస్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను, మధ్యవర్తులను ఎవరూ నమ్మవద్దని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం నియామకాలు చేపడతామని తెలిపారు.

సిరిసిల్ల ప్రాజెక్టు షెడ్యూల్ త్వరలో వెల్లడి

ఇదిలా ఉండగా, సిరిసిల్ల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ షెడ్యూల్ ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానుంది.గ్రామాల వారీగా ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను వీలైనంత త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు.అర్హత సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశిత సమయంలో అవసరమైన ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని అధికారులు సూచించారు.

బీజేపీ మహిళ మోర్చ మండల కమిటీ నియామకం



ఇల్లంతకుంట నవంబర్ 2(ప్రజా జ్యోతి)రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల బీజేపీ మహిళ మోర్చ అధ్యక్షురాలు మారవేణి దివ్య సోమవారం రోజు మహిళ మోర్చ కమిటీని నియమించారు మండలం బిజెపి మహిళ మోర్చ ఉపాధ్యక్షురాలుగా గూడెల్లి స్వప్న , ప్రధానకార్యదర్శిగా ఎండ్ర ప్రమోద, లకు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్వప్న , ప్రమోద , మాట్లాడుతూ మా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ బిజెపి పార్టీ మండల కేంద్రంలో మహిళలను ఐకమత్యం చేసి పార్టీ కోసం నిరంతరం కృషి చేసి పటిష్టంగా బలోపేతం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు ముత్తక్క మండల, కార్యదర్శి అలువాల భారతి , రాష్ట్ర నాయకుడు మ్యాకల మల్లేశం, జిల్లా ఏసీ మోర్చ జనరల్ సెక్రటరీ మామిడి హరీష్ , మండల నాయకులు మారవేణి శ్రీశైలం, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

- కొమ్మలు కొడుతుండగా ప్రమాదం.. చికిత్స పొందుతూ 55 ఏళ్ల రాయమల్లు కన్నుమూత



వీణవంక, నవంబర్ 2 (ప్రజాజ్యోతి) టేకు చెట్ల కొమ్మలు కొడుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన వీణవంక మండలం కృష్ణంపేట గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన బోయిని రాయమల్లు (55) మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణంపేట గ్రామానికి చెందిన కల్లేపల్లి మదనయ్య తన వ్యవసాయ భూమిలోని టేకు చెట్ల కొమ్మలు కొట్టేందుకు అక్టోబర్ 31న ఉదయం రాయమల్లును కూలీ పనికి పిలిచాడు. దీంతో రాయమల్లు చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు గాయాలయ్యాయి.వెంటనే 108 అంబులెన్స్ లో జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ లోని హంస ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో నవంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 2:32 గంటలకు చికిత్స పొందుతూ రాయమల్లు తుదిశ్వాస విడిచాడు.మృతుడి కుమారుడు బోయిని కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వీణవంక ఎస్సై వెల్లడించారు.కూలీ పనికి వెళ్లిన వ్యక్తి విగతజీవిగా తిరిగి రావడంతో కృష్ణంపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సాలార్ద్రి వాకర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా బొల్లి స్వామి



ధర్మారం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి) :"నడవండి.. నడిపించండి.. ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ నిత్యం నడక, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సాలాద్రి వాకర్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల అధ్యక్షుడు బొల్లి స్వామి పిలుపునిచ్చారు.సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యవర్గసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా గవర్నర్ అన్నాడి సుధాకర్ రావు, మురళీకృష్ణ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కరీంనగర్ ప్లే గ్రౌండ్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఎల్లా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ధర్మారం మండలం నర్సింహులపల్లి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆకుల స్వామిని, దొంగతుర్తి గ్రామ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాలకుర్తి లక్ష్మణ్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా బొల్లి స్వామి మాట్లాడుతూ డబ్బు, ధనం కంటే ఆరోగ్యమే అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం నడకతో పాటు వ్యాయామం చేయడం వల్ల శారీరక దృఢత్వం పెరగడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. క్రమం తప్పకుండా నడవడం వల్ల బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధుల ముప్పును తగ్గించుకోవచ్చని అన్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలి మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, మాటపై అదుపు, మనసుపై నియంత్రణకు దోహదపడుతుందని వివరించారు. వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపడితే కుటుంబం, సమాజం కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాలాద్రి వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవిరాజ లింగయ్య, సలహాదారు కొమురయ్య, దొంగతుర్తి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలకుర్తి లక్ష్మణ్ గౌడ్, నర్సింహుల పల్లి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల స్వామి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డంకి కాదు

- దివ్యాంగ విద్యార్థుల్లో ధైర్యం నింపడమే లక్ష్యం: ఎంఈఓ డా. యేలిగేటి మల్లికార్జున్



గంగాధర 02/నవంబర్/2026 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలోని బ్లాక్ ప్రాంతంలో ఉన్నజడ్పీ పాఠశాల ఆవరణలో భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను మండల విద్యాధికారి డా. యేలిగేటి మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్నప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో మ్యూజికల్ ఛైర్, డ్రాయింగ్, రన్నింగ్, ఫ్రాగ్ జంప్ తదితర పోటీలను నిర్వహించామన్నారు. ప్రతిభకు వైకల్యం అడ్డంకి కాదన్నారు. దివ్యాంగ విద్యార్థుల్లో ధైర్యం నింపడమే లక్ష్యం అని ఆయన సృష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



ధర్మారం, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని దొంగతుర్తి ఏఈఓ ఎస్. వినీత్ సూచించారు.ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతూ పరికి బదులుగా మొక్కజొన్న, పెసర, మినుము, శనగ, నువ్వులు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీతో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. సర్పంచ్ సూర రజిత వెంకటేశం, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- ప్రత్యేక అధికారిని రాజేశ్వరి
- పాఠశాలలో మధ్యాహ్న భోజన తనిఖీ



రామడుగు, నవంబర్ 02 (ప్రజా జ్యోతి) విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రామడుగు మండలం ప్రత్యేక అధికారిని బండి రాజేశ్వరి సంబంధిత అధికారులను సూచించారు. ఈ సందర్భంగా రామడుగు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం భోజన నాణ్యత రుచి పరిశుభ్రత తదితర అంశాలను స్వయంగా పరిశీలించడంతో పాటు విద్యార్థులను భోజనం నాణ్యత పై ప్రశ్నించారు.అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని చదువుపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని సూచించారు.సమయాన్ని వృధా చేసుకోకుండా సిలబస్ను ఎప్పటికప్పుడు రివిజన్ చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి,ఎంఈఓ రంగనాథ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్ళపల్లి మండలంలో టిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

- వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు గౌరు రాజశేఖర్ ఆధ్వర్యంలో చేరికలు



తంగళ్ళపల్లి (ప్రజా జ్యోతి) నవంబర్ 2 టిఆర్ఎస్ లో చేరిన మహిళలు కవితక్క ముఖ్యమంత్రి చేసుకుంటామని నినాదాలు –టిఆర్ఎస్ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ మజీద్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్ళపల్లి మండలంలోని రాళ్ల పేట గ్రామంలో సోమవారం టిఆర్ఎస్ నాయకులు గౌరు రాజశేఖర్ ఆధ్వర్యంలో 100 మంది టిఆర్ఎస్ పార్టీలో చేరగా సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్, నియోజకవర్గం నాయకులు అల్లె శంకర్, ముష్కం నందిని, చిన్ని బాల్ రెడ్డి, సయ్యద్ జావిద్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు కదిరే భాస్కర్ గౌడ్, కోశాధికారి బైరి రాజేష్ పార్టీ కండువాలు కప్పి టిఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ అధినేత కవితక్క ముఖ్యమంత్రి కావాలని టిఆర్ఎస్ పార్టీని తంగళ్ళపల్లి మండలంలో టిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తామని వాటిలో చేరిన వారు హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కవితక్క తప్పకుండా ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ బలోపేతానికి ముందుకు రావడం జరుగుతుందన్నారు. కవితక్క ప్రవేశ పెట్టిన పాంచ జన్యం ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం రైతే రాజు, ఉపాధి ఉద్యోగాలు, సామాజిక న్యాయం అమలుచేసి రాష్ట్ర అభివృద్ధికి పాల్పడడం జరుగుతుందని, అందుకే రాష్ట్ర ప్రజలందరూ కవితక్కను ముఖ్యమంత్రి చేసుకునే వరకు కృషి చేయాలని కోరారు.కవితక్కను ముఖ్యమంత్రి చేయడానికి ముఖ్యంగా మహిళలు స్వచ్ఛందంగా ముందుకు రావడం జరుగుతుందన్నారు. తంగళ్లపల్లి నాయకులు రాచర్ల రాజు, గౌరు శ్రీనివాస్, ఇల్లందుల శ్రీనివాస్, అలుగునూరి బాలయ్య, ఇల్లందుల మల్లయ్య, మెతుకు లక్ష్మీనర్సవ్వ, ఇల్లందుల భాగ్య, మోహిని కనకవ్వ, మహేశ్వరి, సరిత, లక్ష్మి, శిరీషతో పాటు 100మంది పాల్గొన్నారు.

రైతులు ఆరో తడి పంటలను వేసుకోవాలి

- ఏవో సంధ్య .రైతులకు అవగాహన



కాల్వశ్రీరాంపూర్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి)కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. పెగడపల్లిగ్రామరైతు వేదికలో. రైతులకు ఏలినోవా వల్ల కలుగు నష్టాలను. పంట మార్పిడి వల్ల కలుగు రాబాలని. అవశేషాలను తగలబెట్టడం పై కలుగు నష్టాలను. ఆరోతడి పంటలపై అవగాహన సదస్సును. మండల వ్యవసాయ అధికారి సంధ్య రైతులకు సోమవారం రోజున నిర్వహించారు. అనంతరం .భూసార పరీక్ష కార్డులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సతీష్. గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ .ఉప సర్పంచ్ పత్తి శ్రీనివాస్ రెడ్డి. రైతులు తదితరులుపాల్గొన్నారు.

అపరాలు సాగు చేస్తే రు.500బోనస్



చొప్పదండి, నవంబర్ 2(ప్రజాజ్యోతి): అపరాలు కంది, పెసర, శనగ, మినుములు, బబ్బెర పంటలకు ప్రభుత్వ మద్దతు ధరకు అదనంగా క్వింటాల్కు రు.500 బోనస్ చెల్లిస్తామని చొప్పదండి సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈమేరకు సోమవారం జరిగిన పాలకవర్గసమావేశంలో తీర్మానించారు. చైర్మన్ మాట్లాడుతూ పంటల మార్పిడి లక్ష్యంతో పాటు ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను తట్టుకునేందుకు నీటి వనరులను పొదుపుగా వాడాలని సూచించారు. విద్యుత్ ను ఆదా చేసేలా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేలా బోనస్ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులు ఎక్కువగా వరి పంట సాగు చేస్తున్నారని, పంట చేతికొచ్చే సమయాన కొన్నిసార్లు చివరి తడికి నీళ్లు అందక ఇబ్బందులు పడటంతో పాటు ఒకే పంటను సాగు చేయడంతో సరియగు దిగుబడులు రావడం లేదన్న ఆలోచనతో వరికి ప్రత్యామ్నాయంగా అపరాల సాగును ప్రోత్సహించాలనిని ర్ణయించామన్నారు. రైతులు పండించిన అపరాలను సంఘం ఆధ్వర్యంలోనే కొనుగోలు చేసి వాటిని ప్రాసెసింగ్ చేసి వినియోగదారులకు తక్కువ ధరలో నాణ్యమైన పప్పు దినుసులుగా మార్చి అందించడానికి దాల్ మిల్లును ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోనే చొప్పదండి వ్యవసాయ సహకార సంఘంనకు ఉన్న పేరును కాపాడుకుంటూనే రైతుల సంక్షేమమే లక్ష్యంగా పాలకవర్గ ఆమోదంతో ఈ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశా రు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చందు, సీఈఓ తిరుపతి రెడ్డి, వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, డైరెక్టర్లు లింగంపల్లి దేవదాసు, పెద్దిరెడ్డి గణపతి రెడ్డి, మారు తిరుపతి రెడ్డి, గాండ్ల రాజయ్య, గంకిడి కృష్ణా రెడ్డి, చొక్కల్ల కనకయ్య, కుర్ర రాజయ్య, పూదరి సత్యం, భక్తు లక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ పై దాడి వ్యక్తి అరెస్టు



ఎల్లారెడ్డిపేట నవంబర్ 2 ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండలం బండ లింగంపల్లి గ్రామానికి చెందిన బొడ్డురాజు ఇరువురి మధ్యతగాదాలను చేసుకుంటుండగా రాజు మధ్యవర్తిగా వెళ్లి అతనిపై కత్తి దాడి జరిగినది బొడ్డురాజు కడుపులో కత్తి దిగడంతో అతను ఎల్లారెడ్డిపేట హాస్పిటల్ లో చేర్చారు కత్తితో పొడిచిన వ్యక్తి అజ్మీరా శ్రీను మెదక్ జిల్లా వారిని పెయింటింగ్ పనిచేస్తూ తెరిపెల్లి సంతోష్ ఇంట్లో వచ్చినాడు బొడ్డు రాజును చంపాలనే ఉద్దేశంతోనే కత్తితో తో పొడిచినట్టు అజ్మీర శీను పై చర్య తీసుకోవాలని బొడ్డురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజ్మీర శీను అత్యాయత్నం కేసు కింద అరెస్ట్ చేసినట్టుగా ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్టుగా పోలీసులు తెలిపారు ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ఆవేశపడకుండా గొడవలకు దిగరాదని దాడులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు